క్లుప్తంగా

జోగుళాంబ సన్నిధిలో డీసీపీ



జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామివారి ఆలయాలను శనివారం రాత్రి హైదరాబాద్ చెందిన సెంట్రల్ జోన్ డీసీపీ రష్మి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బాలబ్రహ్మేశ్వర ఆలయంలోని స్వర్ణ లింగానికి అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారి ఆలయంలో జరిగే దశ విదహారతి కార్యక్రమంలో పాల్గొన్నారుఆమెతో పాటు ఎస్‌ఐ నాగరాజు ఉన్నారు. అదే విధంగా ఉదయం జిల్లా జడ్జి కుష, సీనియర్ సివిల్ జడ్జి గంటా కవిత దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆదిశిలా క్షేత్రంలో ప్రత్యేక పూజలు



మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సద్దలోనిపల్లి కృష్ణస్వామి, పాల్వాయి అడవి ఆంజనేయస్వామి, కుర్తిరావులచెర్వు గట్టు తిమ్మప్ప స్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదిశిలా క్షేత్రంలో భక్తులకు అన్నదానం సౌకర్యం కల్పించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ధరూరు: మండలంలోని ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద చింతరేవుల ఆంజనేయ స్వామి, అల్వలపాడు తెలుగోనిపల్లి ఆంజనేయ స్వామి ఆలయం, ధరూరు ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు పెద్ద ఎత్తున హాజరై పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

విజయసంకల్ప సభకు తరలిన నాయకులు



మానవపాడు: మండలంలోని బీజేపీ నాయకులు నాగర్‌కర్నూల్‌లో మోదీ విజయ సంకల్ప సభకు బీజేపీ నాయకులు బయలుదేరారు. మండల అధ్యక్షులు మురళీకృష్ణ ఆధ్వర్యంలో భారీగా తరలి వెళ్లారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల, ఎర్రవల్లి మండలాలకు చెందిన పలువురు బీజేపీ శ్రేణులు విజయ సంకల్ప సభకు తరలి వెళ్లారు.

రాజోళి: నాగర్‌కర్నూల్‌లో మోదీ సభకు బీజేపీ నాయకులు తరలివెళ్లారు. మండల కేంద్రం, ఆయా గ్రామాల నుంచి కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు.

అయిజ: విజయ సంకల్ప సభకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి బీజేపీ నాయకులు తరలి వెళ్లారు. బీజేపీ మండల అధ్యక్షుడు శేఖర్ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల ప్రజలు ఒక చోటకు చేరి వివిధ వాహనాల్లో నాగర్‌కర్నూల్‌కు తరలివెళ్లారు.

ముగ్గురిపై దాడి: కేసు నమోదు

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు టోల్‌ప్లాజా సమీపంలో వైన్ షాపుల వద్ద కర్నూల్‌కు చెందిన వ్యక్తులపై కొందరు వ్యక్తులు దాడి చేయగా ముగ్గురికు తీవ్ర గాయాలైనట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం పుల్లూరు టోల్ ప్లాజా సమీపంలోని వైన్ షాపులో మధ్యాహ్నం సమయంలో కర్నూల్ పట్టణం కండేరు వీధికి చెందిన ఎరకలి మూర్తి, అశోక్, రాజు అనే వ్యక్తులు మద్యం తాగడానికి వచ్చారు. అక్కడే కర్నూల్ పట్టణం ఎస్‌టీఆర్ బిల్డింగ్‌లకు చెందిన మహేశ్వర్‌రెడ్డి అతని అనుచరులు మద్యం తాగుతున్నారు. వారి ఇరువురి మధ్య మాటామాటా పెరిగి గొడవకు దారి తీసినట్లు తెలిపారు. మహేశ్వర్ రెడ్డి, అతని అనుచరులు కలిసి ఎరుకలి మూర్తి, అశోక్, రాజు అనే వ్యక్తులపై రాళ్లు, రాడ్లతో దాడి చేశారు. ఇద్దరి పరిస్థితి తీవ్రంగా ఉందని, ఒకరికి గాయాలు కావడంతో అక్కడ ఉన్న వారు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకుని 108లో కర్నూల్‌కు తరలించారు. ఎరుకలి చిన్న మారెన్న ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలి పారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అయిజ: పట్టణంలోని భరత్ నగర్‌లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసేందుకు 11 కేవీ అయిజ టౌన్ 2వ ఫీడర్‌కు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఈడీఈ గోవిందు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో ఆదివారం మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు భరత్‌నగర్, కొత్తబస్టాండ్ పరిధిలోని వివిధ కాలనీలకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏడీఈ తెలిపారు. వి ద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

తడిపొడిపై ధ్యాసే లేదు!

- చెత్తను కాల్చివేస్తే చర్యలేవి?
- నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం
- పట్టించుకోని అధికారులు

మానవపాడు: గ్రామాల పరిశుభ్రతతో పాటు పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూర్చాలనే ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. తడిపొడి చెత్తను వేరు చేసే సేంద్రియ ఎరువుగా మార్చాలనే ఉద్దేశ్యం ప్రభుత్వం గ్రామ పంచాయతీల్లో సెగ్రిగేషన్ షెడ్లను నిర్మించింది. మానవపాడు మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో వీటి నిర్మాణం చేపట్టారు. ఒక్కో సెగ్రిగేషన్ షెడ్‌ను రూ.2.50 లక్షలు వెచ్చించారు. సెగ్రిగేషన్ షెడ్లు నిర్మించిన సమయంలో వాటి ఫలితాలు బాగానే కనిపించాయి. తరువాత వాటి నిర్వహణ లేకపోవడంతో ప్రస్తుతం సెగ్రిగేషన్ షెడ్లు నిర్వహణ అధ్వానంగా మారాయి.

చెత్తను కాల్చేస్తున్నారు..

గ్రామాల్లో ఉదయం ఇంటింటికి వెళ్లి ట్రాక్టర్ల ద్వారా సేకరించిన చెత్తను సెగ్రిగేషన్‌లకు తరలించాలి. ప్రసుత్తం కొన్ని గ్రామాల్లో ట్రై సైకిల్ ద్వారా చెత్తను తరలిస్తున్నారు. సెగ్రిగేషన్ షెడ్లకు తరలించాల్సిన తడి, పొడి చెత్తను సైతం కాల్చేస్తున్నారు. పంచాయతీ కార్మికులు తడిపొడి చెత్తను వేరుచేయడంలో విఫలమవుతున్నారు. అధికారులు సైతం పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. చెత్తను కాల్చితే కఠిన చర్యలుంటాయని చెబుతున్నా.. మాటలకే పరిమితమైంది. సేంద్రియ ఎరువులు తయారు చేసే తొట్టిలలో పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి.

నిర్వహణ లోపం..

సెగ్రిగేషన్ షెడ్ల నిర్వహణను పంచాయతీ అధికారులు సరిగా పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. ఉపాధిహామీ పనులతో పూర్తి చేసిన బాధ్యులు మౌలిక సదుపాయలు అందించడంలో విఫలమయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తడిపొడి చెత్తను వేరుచేసి కాల్చకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రత్యేక అధికారులు ఎక్కడ?

గ్రామ సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో.. ఆయా గ్రామాల్లో ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. ప్రత్యేక పాలన ప్రారంభమై 40రోజులు దాటినా గ్రామాల్లో ఏ మార్పు లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ చూపాలని ప్రజలు పేర్కొన్నారు.



గోకులపాడులో రోడ్డు పక్కనే తడిపొడి చెత్త కాల్చివేత



చెన్నిపాడు మురుగుకాల్వలో వ్యర్థాలు

చర్యలు తీసుకుంటాం..



ప్రారంభంలో తడిపొడి చెత్త వేరు చేసే విషయంలో అవగాహన కల్పించాం. ఏఏ గ్రామాల్లో పారిశుద్ధ్యలోపం, ప్రత్యేక అధికారులు వెళ్తలేరో.. వారిపై చర్యలు తీసుకుంటాం. చెత్తను కాల్చరాదు. ఎవరైతే చెత్తను కాలుస్తున్నారో వారిపై చర్యలు తీసుకుంటాం. ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తాం.

– ఆంజనేయరెడ్డి, ఎంపీడీఓ, మానవపాడు

'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



గురుకుల పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంఈఓ కొండారెడ్డి

గట్టు: పదో తరగత పబ్లిక్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ కొండారెడ్డి తెలిపారు. శనివారం గట్టులోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని ఎంఈఓ కొండారెడ్డి, చీఫ్ సూపరింటెండెంట్ శేషఫణి శర్మ, డిపార్టుమెంటల్ అధికారి శంకర్‌రెడ్డిలతో కలిసి పరిశీలించారు. గట్టులో రెండు పరీక్ష కేంద్రాలున్నాయని, గురుకుల పాఠశాల, సంత బజారు ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ తెలిపారు. గురుకుల పాఠశాల పరీక్ష కేంద్రంలో 210 మంది విద్యార్థులు, సంత బజారు ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 125 మంది విద్యార్థులు, మాచర్ల ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 120 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు ఎంఈఓ తెలిపారు. ఆయా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ తెలిపారు.

పరీక్షల భయాన్ని వీడాలి

పరీక్షలంటేనే విద్యార్థులు ఒక రకంగా భయానికి గురవుతారని, అలాంటి భయాన్ని వీడి ధైర్యంగా పబ్లిక్ పరీక్షలకు సిద్ధం కావాలని జెడ్పీటీసీ బాసు శ్యామల 10వ తరగతి విద్యార్థులకు సూచించారు. తప్పెట్లమొర్సు ఉన్నత పాఠశాలను జెడ్పీటీసీ బాసు శ్యామల పరిశీలించారు. 10వ తరగతి విద్యార్థులతో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు కృష్ణయ్యగౌడు, హెడ్మాస్టర్ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఈనెల 18 నుంచి 30 వరకు నిర్వహించే పదో తరగతి పరీక్షలకు కావాల్సిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు మండల విద్యాధికారి రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఇటిక్యాల మండలంలో నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా, మొత్తం 616 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఇటిక్యాల, కోదండాపురం, కొండేరు, ఎర్రవల్లి పదో పటాలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పది పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్ష ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు ఉంటుందని, విద్యార్థులు ఒక గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరాలన్నారు.

పశువులకు రోగనిరోధక టీకాలు

అయిజ: పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా రోగనిరోధక టీకాలు వేసే కార్యక్రమం మండలంలో కొనసాగుతుందని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూపారాణి తెలిపారు. శనివారం మండలంలోని మూగోనిపల్లిలో పశువులకు వెటర్నరీ సిబ్బంది గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. మొత్తం 100 పశువులకు వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు. గాలికుంటు వ్యాధిని అరికట్టేందుకు ప్రభుత్వం ఉచితంగా టీకాలు అందజేస్తుందని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గద్వాల వ్యవసాయం: పశువుల్లో గాలికుంటు వ్యాధి రాకుండా పశువులకు నివారణ టీకాలు తప్పక వేయించాలని మండల పశువైద్యాధికారి శంకరయ్య సూచించారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మండలంలోని తెలుగోనిపల్లి, వీరాపురం, బస్సాపురం గ్రామాల్లో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. మూడు గ్రామాల్లో 62మంది రైతులకు చెందిన 553 పశువులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది శశికుమార్, జహంగీర్, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

చెత్తపై పన్ను ఉపసంహరించుకోవాలి



మున్సిపల్ చైర్మన్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

గద్వాల: పట్టణ సంస్కరణలలో భాగంగా మున్సిపాలిటీ ప్రజలపై విధించే చెత్తపన్నును ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి డిమాండ్ చేశారు. చెత్త పన్ను విధింపునకు నిరసనగా శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడారు. ఒకవైపు నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని, మరోవైపు ప్రజలకు ఉపాధి లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలపై భారాలు మోపుతున్న పన్నును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో విఫలమైన మున్సిపల్ పాలకవర్గం పన్నుభారం మోపడంలో శ్రద్ధ చూపడం దారుణమన్నారు. పట్టణంలో ఉన్న అనేక విలువైన భూములు ఆక్రమణలకు గురయ్యాయని, వాటిని పరిరక్షించి ఆదాయం పెంచుకోవాలని సూచించారు. తక్షణమే ప్రజలపై మోపిన చెత్త పన్ను ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నర్సింహ, వెంకటేష్, రంగన్న, రామకృష్ణ, కల్యాణ్, వీరేష్, గోకరన్న, అశోక్, నరేష్, కృష్ణ, పరమేష్, నర్సింహ పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి



గద్వాల అర్బన్: మైనార్టీ రెసిడెన్సియల్ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని మైనార్టీ సబ్ ప్లాన్ చైర్మన్ అతిఖుర్ రహ్మాన్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని మైనార్టీ రెసిడెన్సియల్ పాఠశాలలో మైనార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. రంజాన్ మాసం సందర్భంగా విద్యార్థులకు కావాల్సిన అన్ని వసతులను కల్పించాలన్నారు. సమావేశంలో మైనార్టీ కళాశాల ప్రిన్సిపాల్ జలీల్, మైనార్టీ స్కూల్ ప్రిన్సిపాల్ వనిత, ఉపాధ్యాయులు, మైనార్టీ సంఘం నాయకులు ఉన్నారు.

పకడ్బందీగా ఎల్‌సీడీసీ సర్వే

- రాష్ట్ర పర్యవేక్షణ అధికారి జరీనాబాను

ఎర్రవల్లిచౌరస్తా: గ్రామాల్లో వైద్య సిబ్బంది చేపట్టిన ఎల్‌సీడీసీ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర పర్యవేక్షణ అధికారి జరీనాబాను అన్నారు. శనివారం ఇటిక్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కొండేరులో నిర్వహిస్తున్న సర్వేను ఆమె పర్యవేక్షించారు. గ్రామంలోని పలు కుష్ఠు వ్యాధి అనుమాన కేసులకు వైద్య సిబ్బందితో కలిసి ఆమె స్వయంగా పరీక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ నెల 11వ తేదీ నుంచి 24 వరకు 14రోజుల పాటు గ్రామాల్లో వైద్య సిబ్బంది సర్వే నిర్వహిస్తారన్నారు. వైద్య సిబ్బంది ఆయా గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి వైద్య పరీక్షలు చేస్తారన్నారు. ఎవరికైనా అనుమానం ఉన్న మచ్చలు, స్పర్శ లేని మద్దుబారిన మచ్చలు ఉంటే వాటిని గుర్తించి స్థానిక ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు నిర్వహించి నిర్ధారణ అయితే వారికి ఉచిత చికిత్సను అందజేస్తారన్నారు. ఇలాంటి మచ్చలున్న కేసులు ఎవరైనా చికిత్స చేయించుకోకపోతే అట్టి బ్యాక్టీరియా చేతులు, కాళ్ల వద్ద గల నరాలపై ప్రభావం చూపుతాయన్నారు. దీనివల్ల అంగవైకల్యం వచ్చే ప్రమాదం అధికంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ పారామెడికల్ అధికారి ప్రేమ్ సాగర్, డీపీఎం హనుమంతురావు, సూపర్‌వైజర్ శంకరయ్యశెట్టి, లెప్రసి నోడల్ పర్సన్ రమేష్, నర్మదా ఉన్నారు.



కొండేరులో సర్వేను పరిశీలిస్తున్న రాష్ట్ర పర్యవేక్షణ అధికారి జరీనాబాను

సదస్సును జయప్రదం చేయండి



గద్వాల అర్బన్: డబ్ల్యూటీఓ నుంచి భారత్ బయటకు రావాలని తదితర అంశాలపై ఈనెల 23న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సదస్సును నిర్వహించనున్నట్లు తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవనంలో సదస్సుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, ప్రజలు, మేధావులు అధిక సంఖ్యలో తరలివచ్చి సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సత్యారెడ్డి, రామరాజు, పౌరహక్కుల సంఘం నాయకులు సుబాన్, పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ ఇక్బాల్ పాష పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను అధిగమించాలి

ధరూరు: ఈ ఏడాది అంతంత మాత్రంగా కురిసిన వర్షాలతో జూరాల ప్రాజెక్టులో నీటి నిల్వలు తక్కువగా ఉండడంతో ఈ వేసవిలో నెల రోజుల పాటు మిషన్ భగీరథ తాగునీటి సరఫరాకు అంతరాయం కలిగే అవకాశాలున్నాయని, వాటిని అధిగమించేందుకు గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని మండల మిషన్ భగీరథ అధికారులు వెల్లడించారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ మీటింగ్ హాల్లో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలు చదివి వినిపించగా, మిషన్ భగీరథపై ఏఈ పరమేష్ మాట్లాడారు. జూరాల ప్రాజెక్టులో నీటి నిల్వలు చాలా తక్కువ ఉన్నాయని, ఈ వేసవిలో ముందస్తు వర్షాలు కురవకపోతే నెల రోజుల పాటు తాగు నీటి సమస్య ఏర్పడే అవకాశాలుంటాయని తెలిపారు. అందుకు తగ్గట్టుగా గ్రామాల్లో పాత బోర్లు, చేతి పంపులు రిపేర్ చేయించి సిద్ధం చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ వెంకట్రావు మాట్లాడుతూ కొత్తగా వచ్చి పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో అందుబాటులో ఉండాలన్నారు. తహసీల్దార్ వెంకట్రావు మాట్లాడారు. కార్యక్రమంలోఎంపీపీ నజీమున్నీసా బేగం, ఎంపీడీఓ ఎండీ మంజూల, ఎంపీఓ కృష్ణమోహన్, ఆనంద్, పరమేష్ పాల్గొన్నారు.

వంద మందిని సృష్టిస్తాం

ఎర్రవల్లిచౌరస్తా: పార్టీ నుంచి ఒక్కరు పోతే వంద మందిని తయారు చేసుకునే మెకానిజం బీఎస్పీకి ఉందని, దాని ద్వారానే పార్టీ కార్యకర్తలను సృష్టించుకుంటామని బీఎస్పీ సీనియర్ నాయకులు రాంబాబు అన్నారు. పార్టీ చీఫ్ డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ శనివారం తన పదవికి, పార్టీకి రాజీనామా చేసిన సందర్భంగా ఆయన ఒక ప్రకటన ద్వారా పేర్కొన్నారు

రాజీపడటంతో ఇద్దరు గెలిచినట్లే

- లోక్ అదాలత్ జడ్జీలు

అలంపూర్: వ్యక్తుల మధ్య తగాదాలు తలెత్తినప్పుడు ఇరువురు రాజీపడటం వల్ల ఇద్దరు వ్యక్తులు గెలిచినట్లేనని జిల్లా జడ్జీ, లోక్ అదాలత్ చైర్మన్ కుష, జిల్లా సీనియర్ సివిల్ కోర్టు జడ్జి, లోక్ అదాలత్ సెక్రటరి గంట కవిత అన్నారు. అలంపూర్ మున్సిపాలిటీలోని జూనియర్ సివిల్ కోర్టులో శనివారం లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యక్తుల మధ్య తలెత్తిన తగదాల్లో రాజీ పడడం వల్ల బాధితులకు సత్వర న్యాయం అందుతుందన్నారు. లోక్ అదాలత్ ద్వార పేదలకు ఉచిత న్యాయ సేవలు అందుతాయన్నారు. ఈ అవకాశాన్ని బాధితులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. లోక్ అదాలత్‌లో ఒక కేసులో తల్లీ కొడుకు, మరో కేసులో తండ్రీ కొడుకు, భూ తగాదాలకు సంబంధించిన కేసులో ఇద్దరు వ్యక్తులు రాజీ పడినట్లు తెలిపారు. 1647 కేసులను లోక్‌అదాలత్ ద్వారా పరిష్కరించినట్లు లోక్ అదాలత్ ఇన్‌చార్జి సాయితేజ తెలిపారు. ఇందుకుగాను అపరాధ రుసుం రూ. 6,40,990 కోర్టుకు సమకూరినట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కార్తీక్ రాజ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, న్యాయవాదులు కేవీ తిమ్మారెడ్డి, వెంకటేష్, గజేందర్ గౌడ్ ఉన్నారు.



అలంపూర్‌లో లోక్ అదాలత్ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

గద్వాల: పట్టణ శివారులో కృష్ణనది తీరాన వెలసిన కల్యాణ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. మూడు రోజులుగా ఆలయ ప్రాంగణంలో విశేష పూజ కార్యక్రమాలను నిర్వహించారు. శనివారం ఆలయ ప్రాంగణంలో పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ సరిత ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ పూజ కార్యక్రమాలలో పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ సరిత

పోషకాహారం తీసుకోవాలి



బహుమతులు అందిస్తున్న ఐసీడీఎస్ అధికారి

ఎర్రవల్లిచౌరస్తా: గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంధ్య అన్నారు. శనివారం ఎర్రవల్లి మండలంలోని షేకుపల్లి అంగన్‌వాడీ–2లో నిర్వహించిన పోషణ పక్షం కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన, వంటల పోటీలు, గర్భిణులకు సీమంతాలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బాలింతలకు, గర్భిణులకు, చిన్నారుల తల్లిదండ్రులకు చిరుధాన్యాలలో ఉండే పోషకాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఎక్కువ ఆకుకూరలు, కూరగాయలు తినడం ద్వారా శరీరానికి అవసరమయ్యే అనేక పోషకాలు అందుతాయన్నారు. అనంతరం పోటీలలో గెలుపొందిన మహిళలకు దాత యువరాజ్‌తో కలిసి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు మయూరి, జయమ్మ, ఆయా సురేఖ, బాలింతలు, గర్భిణులు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ధరూరు: పోషణ పక్వాడ దినోత్సవాన్ని మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. శనివారం మండల కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వెంకట్రావ్, సీడీపీఓ హేమలత మాట్లాడారు. పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా గర్భిణులు, బాలింతలు రక్తహీత సమస్య నుంచి బయట పడ వచ్చన్నారు. ముఖ్యంగా చిరు ధాన్యాలను రోజువారి ఆహారంలో తీసుకోవడం వల్ల అనేక ప్రయోజనాలు సమకూరుతాయన్నారు. ప్రతి మహిళా, బాలింత, గర్భిణులు పోషకాహారాన్ని తీసుకోడం ద్వారా మంచి సమాజ నిర్మాణం అవుతుందని ఎంపీపీ నజీమున్నీసా బేగం అన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునీత, అంగన్‌వాడీ టీచర్లు రజియ, వీరమ్మ, వజ్రమ్మ, జయమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రతలు తీసుకోవాలి

మల్దకల్: బరువు, ఎత్తు తక్కువగా ఉన్న చిన్నారు ల ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రతలు తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగరాణి అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. శనివారం మండలంలోని అమరవాయి అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే తల్లి, బిడ్డా ఆరోగ్యంగా ఉంటారన్నారు. రక్తహీనత ఉన్న గర్భిణులు పోషకాలు ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు యశోదమ్మ, పద్మమ్మ, తిమ్మమ్మ పాల్గొన్నారు.

అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

గద్వాల: అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘనంగా నివాళులర్పించారు. ఆయన జయంతిని పురస్కరించుకుని ఆర్యవైశ్య సంఘం నాయకులు ర్యాలీ నిర్వహించారు. శనివారం స్థానిక రాజీవ్ సర్కిల్‌లో ఉన్న పొట్టిశ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు బిలకంటి రాము పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన పొట్టి శ్రీరాములు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నరహరి శ్రీనివాసులు ఆర్యవైశ్య సంఘం నాయకులు నందిమల్ల సురేష్, ఈశ్వరయ్య, సురేష్, ఉరుకుందయ్య, వీరబాబు, భీమ, హరికృష్ణ, బాణాల సునీల్ పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములుకు నాయకులు నివాళి

సమస్యలపై మున్సిపల్ చైర్ పర్సన్‌కు వినతి

అలంపూర్ రూరల్: పట్టణంలోని 6వ వార్డులో ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురికాకుండా సామూహిక మరుగుదొడ్డిని ఏర్పాటు చేయాలని శనివారం వినతిపత్రాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ, మున్సిపల్ సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 13వ తేదీన సామూహిక మరుగుదొడ్డి వార్డు కౌన్సిలర్ జేసీబీతో తొలగించారన్నారు. ఈ వార్డులో చాలా మంది ఇళ్లకు మరుగుదొడ్లు లేవని, వాటినే ఉపయోగించుకుంటున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు లేకుండా కూలి ్చవేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. లేని పక్షంలో శాంతియుతంగా నిరసనలు చేపడతామని హెచ్చరించారు. నరేష్‌కుమార్, శాంతి, పెద్దలక్ష్మీదేవి, లలితమ్మ, రంగస్వామి ఉన్నారు.

నేడు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఆయా గ్రామాల్లో 18–19 సంవత్సరాల వయస్సు గల వారి కోసం ఆదివారం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ నరేందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా బీఎల్‌ఓలు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రామాల్లో ఇంటింటికి తిరిగి వివరాలను సేకరిస్తారని తెలిపారు. శనివారం బీఎల్‌ఓలు ఇంటింటి సర్వే నిర్వహించి, గుర్తించి వారి వివరాలు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

'ఆర్ఎస్పీ అడుగుజాడల్లోనే మేము'

అలంపూర్: మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అడుగుజాడల్లోనే తాము నడుస్తామని బీఎస్పీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఎంసీ కేశవరావు, అలంపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు మహేష్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బీఎస్పీని వీడుతున్నట్లు వస్తున్న వార్తలకు వారు స్పందించారు. వారి పదవులకు రాజీనామా చేస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు.